
# పోతనభాగవతంలో రసగుళికలు



## – ఆర్.శర్మ దంతుర్తి

## 23 వ భాగం

### *హిరణ్యకశిపుడు, ప్రహ్లాద చరిత్ర – 5*

ఇప్పటివరకూ ప్రహ్లాదుడికి మంచిగా చెప్పి చూసాడు తండ్రి. తండ్రికెంత పట్టుదల ఉంటే కొడుక్కి అంతకన్నా ఎక్కువే ఉంది. నేనింత గొప్పవాణ్ణని నువ్వు ఎందుకు గుర్తించలేవురా అంటూంటే, భగవంతుడు నీకన్నా గొప్పవాడు కదా అంటున్నాడు కొడుకు. కానీ అహంకారం వల్ల హిరణ్యకశిపుడు కళ్ళముందు ఒక తెర కప్పేసి ఉంది. దానికితోడు విష్ణువు ఎక్కడా కనపడడు వాడికి. ఏ పేరైతే నిరంతరం వినకూడదనుకుంటున్నాడో అదే కొడుకు అహర్నిశలూ జపిస్తున్నాడు. కోపం ఇంక తారాస్థాయిలో అందుకుంది. ఇప్పుడు చెప్తున్నాడు కొడుకుతో,

క. దిక్కులు గెలిచితి నన్నియు
దిక్కెవ్వఁడు? రోరి! నీకు దేవేంద్రాదుల్
దిక్కుల రాజులు వే ఱొక
ది క్కెఱుఁగక కొలుతు రితఁడె దిక్కని నన్నున్ [7–261]

నేను దశ దిక్కుల్నీ గెల్చినవాణ్ణి. లోకపాలకులనీ గెల్చాను కదా? ఈ దిక్కుల్లో ఉండే పాలకులంతా వేరే దిక్కులేక నన్నే కొలుస్తున్నారు. నువ్వు మాత్రం కాదంటావా? ఇది చాలదంటావా?చూస్కో నా బలమెంతో.

క. బలవంతుఁడ నే జగముల
బలములతోఁ జనక వీరభావమున మహా
బలుల జయించితి నెవ్వని
బలమున నాడెదవు నాకుఁ బ్రతివీరుఁడ వై [7–262]

మాహా బలుల్ని అందర్నీ ఓడించేను నేను. అలాంటి వాడినైన నాకు నువ్వు పోటీపడి మీదకి వస్తున్నావే? ఏమిటి నీ బలం? ఎవర్ని చూసుకుని నీకు ఆ ధైర్యం?

వ. అనినఁ దండ్రికి మెల్లన వినయంబునఁ గొడు కిట్లనియె. [7–263]

తండ్రి ఏ విధమైన పరిస్థితిలో ఉన్నాడో తెల్సింది కదా?..."గంపమానగాత్రుండును నరుణీకృతనేత్రుండును" కళ్ళు ఎర్రగా అయ్యి, గాత్రం కంపిస్తోంది వాడు మాట్లాడుతూంటే. అంత కోపంలో ఉన్న తండ్రితో ప్రహ్లాదుడు ఎలా మాట్లాడుతున్నాడు? "మెల్లన వినయంబున.."

క. బలయుతులకు దుర్బలులకు
బల మెవ్వఁడు? నీకు నాకు బ్రహ్మాదులకున్
బల మెవ్వఁడు ప్రాణులకును
బల మెవ్వం డట్టి విభుఁడు బల మసురేంద్రా! [7-264]

బలం ఉన్నవాళ్ళకీ, లేనివాళ్లకీ కూడా భగవంతుడే బలం. ఇక్కడ పోతన రాసిన పద్యాలు అద్భుతంగా ఉంటాయి. " నెవ్వని బలమున నాడెదవు నాకుఁ బ్రతివీరుఁడ వై.." అని అడిగితే, .."బలమెవ్వడు? నీకు నాకు బ్రహ్మాదులకున్.." అని దీటుగా సమాధానం వస్తోంది కొడుకు దగ్గిర్నుంచి.

క. దిక్కులు కాలముతో నే
దిక్కున లే కుండుఁ గలుగుఁ దిక్కుల మొదలై
దిక్కుగల లేని వారికి
దిక్కయ్యెడు వాఁడు నాకు దిక్కు మహాత్మా! [7-265]

దిక్కులన్నీ ఏ కాలంతో పాటు లేకుండాపోతాయో, ఉన్నప్పుడు దిక్కులన్నింటికీ ఉండే దిక్కెవ్వడో, దిక్కు ఉన్నవాళ్ళకీ లేనివాళ్ళకీ కూడా దిక్కెవరో ఆయనే నాకు దిక్కు మహాత్మా అంటున్నాడు. తండ్రిని ఏవగించుకోకుండా "మహాత్మా" అంటున్నాడు చూసారా? అదే దైవీ లక్షణం. అటునుంచి చూస్తే హిరణ్యకశిపుడిది అసురలక్షణం అని తెలుస్తోంది కదా? అలా కాదూ, శ్రీహరి నీకు వైరి అంటావేమో, అయితే విను.

సీ. కాలరూపంబులఁ గ్రమవిశేషంబుల
నలఘుగుణాశ్రయుం డయిన విభుఁడు
సత్త్వబలేంద్రియ సహజప్రభావాత్ముఁ
డై వినోదంబున నఖిలజగముఁ
గల్పించు రక్షించు ఖండించు నవ్యయుం
డన్ని రూపము లందు నతఁడు గలఁడు
చిత్తంబు సమముగాఁ జేయుము మార్గంబుఁ
దప్పి వర్తించు చిత్తంబుకంటె [7-266]

తే. వైరు లెవ్వరు చిత్తంబు వైరి గాఁక?
చిత్తమును నీకు వశముగాఁ జేయ వయ్య!
మదయుతాసురభావంబు మానవయ్య!
యయ్య! నీ మ్రోల మేలాడ రయ్య! జనులు. [7-266.1]

పరమేశ్వరుడు త్రిగుణాత్మంబైన లక్షణాలతో వినోదంగా ఈ జగాలన్నీ కల్పిస్తాడు. అవే మళ్ళీ లయం చేస్తూ ఉంటాడు. ఇందులో నీకు శతృవెవరనే ప్రసక్తి లేదు. నీ మనసే కదా నీకు శతృవు? ఓ సారి చూసుకో. నీ మనసు వశం చేసుకున్నావంటే నీ అంత గొప్పవాడు ఇంకోడు లేడు.

ఉ. లోకము లన్నియున్ గడియలోన జయించినవాఁడ వింద్రియా
నీకముఁ జిత్తమున్ గెలువ నేరవు నిన్ను నిబద్ధుఁ జేయు నీ
భీకర శత్రు లార్వురఁ బ్రభిన్నులఁ జేయుము ప్రాణికోటిలో
నీకు విరోధి లేఁ డొకఁడు నేర్పునఁ జూడుము దానవేశ్వరా! [7-267]

లోకాలన్నీ గడియలో జయించానంటావు. మనసుని కుదురుగా ఉంచుకోలేకపోతున్నావ్. నీకున్న ఆరుగురి అంతఃశతృవుల్నీ (అరిషడ్వర్గాలు) సరిగ్గా చూసుకో. అప్పుడు నీకు ప్రాణికోటిలో విరోధి అనేవాడే ఉండడు. కొంచెం నేర్పుగా ఆలోచించి చూడు మరి.

వ. అనినఁ బరమభాగవతశేఖరునకు దోషాచరశేఖరుం డి ట్లనియె. [7-269]

ఇలా అనేసరికి తండ్రి సమాధానం చెప్తున్నాడు. ఇక్కడ పోతన తండ్రీ కొడుకులని ఏమన్నాడో గమనించారా? ప్రహ్లాదుడు పరమభాగవతాశేఖరుడు, తండ్రి దోషాచరశేఖరుడు (రాత్రిపూట తిరిగే రాక్షసులో గొప్పవాడు).

క. చంపినఁ జచ్చెద ననుచును
గంపింపక యోరి! పలువ! కఠినోక్తుల నన్
గుంపించెదు చావునకుం
దెంపరి యై వదరువాని తెఱఁగునఁ గుమతీ! [7-270]

చంపితే ఛస్తాననీ, ఏమిట్రా వాగుడు? చావుకి తెగించినట్టున్నావు. ఎక్కడున్నాడు శ్రీహరి?

శా. నాతోడం బ్రతిభాషలాడెదు జగన్నాథుండ నా కంటె నీ
భూతశ్రేణికి రాజు లేఁ డొకఁడు; సంపూర్ణ ప్రభావుండు మ
ద్భ్రాతం జంపిన మున్ను నే వెదకితిం బల్మాఱు నారయణుం

దే త ద్విశ్వములోన లేఁడు; మఱి వాఁ డెందుండురా? దుర్మతీ! [7-271]

నాకంటే జగన్నాథుడు ఈ ప్రపంచంలో లేదు. నాతోటే నువ్వు వాదిస్తున్నావు. నేను వెతికాను నీ పినతండ్రిని శ్రీహరి చంపాక. ఒకసారి కాదు పలుమార్లు. ఈ విశ్వంలో ఎక్కడాలేదూ, నాకు కనపడలేదు వెతికితే. దుర్మతీ ఎక్కడున్నాడురా శ్రీహరి?

వ. అనిన హరికింకరుండు శంకింపక హర్షపులకాకుంర సంకలిత విగ్రహుండై యాగ్రహంబు లేక హృదయంబున హరిం దలంచి నమస్కరించి బాలవర్తనంబున నర్తనంబు జేయుచు నిట్లనియె. [7-273]

ఇలా అనేసరికి ప్రహ్లాదుడు (హరి కింకరుండు) ఒళ్ళు పులకిస్తూ మనసు లో ఏమీ అనుమానం లేకుండా – అంటే ఎంత నమ్మకమో చూడండి – నాట్యం చేస్తూ ఇలా అన్నాట్ట.

మ. కలఁ డంభోధిఁ, గలండు గాలిఁ, గలఁ డాకాశంబునం, గుంభినిం
గలఁ, డగ్నిన్ దిశలం బగళ్ళ నిశలన్ ఖద్యోత చంద్రాత్మలం
గలఁ, డోంకారమునం ద్రిమూర్తులఁ ద్రిలింగవ్యక్తులం దంతటం
గలఁ, డీశుండు గలండు, తండ్రీ! వెదకంగా నేల యీ యా యెడన్. [7-274]

గాలిలో, నీళ్ళలో, ఆకాశంలో, దశదిశల్లో, అగ్నిలో, పొద్దున్నా, రాత్రీ, ఆకాశంలో ప్రకాశించే సూర్యుళ్ళో (ఖద్యోత), చంద్రుళ్ళో, ఓంకారంలో, త్రిమూర్తుల్లో, ఆడా, మగా, నపుంసకులలో కూడా ఉన్నాడు. ఎక్కడలేడని చెప్పమంటావయ్యా ఈ ఎడా, ఆ ఎడా కనిపిస్తూంటే? ఇప్పుడైతే మనుషులందరూ సమానమే అందరికీ సమానంగా అన్నీ కల్పించాలి అంటున్నారు కానీ లింగభేధంతో, వివక్షతో చాలా కాలం వేరుగా చూసే ఆచారం ఉండేది కదా? ఎప్పుడో రాసిన భాగవతంలో కూడా మనుషులందరూ సమానం – అందరిలో ఉండేది ఆ పరంజ్యోతే అని ఎప్పుడో చెప్పారు చూసారా?

ఈ పద్యం గురించి ఓ సారి చూద్దాం. మొదట్లో హిరణ్యకశిపుడు బ్రహ్మని వరం ఏమని అడిగాడు?

శా. గాలిం, గుంభిని, నగ్ని, నంబువుల, నాకాశస్థలిన్, దిక్కులన్,
రేలన్, ఘస్రములం, దమఃప్రభల, భూరిగ్రాహ, రక్షో, మృగ
వ్యా ళాదిత్య, నరాది జంతు కలహవ్యాప్తిన్, సమస్తాస్త్ర శ
స్త్రాళిన్, మృత్యువులేని జీవనము లోకాధీశ! యిప్పింపవే. [7-90]

ఇప్పుడు అదే పద్ధతిలో చెప్పేడు ప్రహ్లాదుడు తండ్రి ఎక్కడ చావకూడదనుకున్నాడో అదే గాక ప్రతీదీ కూడా శ్రీహరి మయం అని. ఆ పద్యానికీ ఈ పద్యానికీ ఎన్నిపోలికలున్నాయో చూసారా?

క. ఇందు గలఁ డందు లేఁ డని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెం దెందు వెదకి చూచిన
నందందే కలఁడు దానవాగ్రణీ! వింటే. [7-275]

ఇది చాలదన్నట్టూ తండ్రి గాయం మీద కారం అద్దుతూ చెప్తున్నాడు – ఇందులో ఉన్నాడు, అందులో లేడు అని అనుకోనక్కర్లేదు. ఎక్కడ వెతికితే అక్కడే ఉన్నాడు. కానీ – "దానావాగ్రణి వింటే" అంటున్నాడు. అంటే ఏమిటంటే మనసు మార్చుకు చూడు కనిపిస్తాడు సుమా అని.

మ. హరి సర్వాకృతులం గలం డనుచుఁ బ్రహ్లాదుండు భాషింప స
త్వరుఁడై యెందును లేఁడు లేఁ డని సుతున్ దైత్యుండు తర్జింప శ్రీ
నరసింహాకృతి నుండె నచ్యుతుఁడు నానా జంగమ స్థావరో
త్కర గర్భంబుల నన్ని దేశముల నుద్దండ ప్రభావంబునన్. [7-277]

ఇలా వాదోపవాదాలు జరుగుతున్నాయి. తండ్రి ఎక్కడా లేడు శ్రీహరి అంటూంటే ఎక్కడపడితే అక్కడున్నాడు అని కొడుకు మంకు పట్టు పట్టి చెప్తున్నాడు. హిరణ్యకశిపుడికి కాలం సమీపించింది అని తెలుస్తూనే ఉంది. ఆ సమయంలో శ్రీహరి నృసింహావతారంలో అన్ని జంగమ స్థావరాల్లో దేశ కాల పరిస్థితులతో సంబంధం లేకుండా ఉద్దండ ప్రభావంతో కాసుకుని కూర్చుని ఉన్నాట్ట బయటకి రావడానికి.

ఇక్కడాగి ఓ సారి ఆలోచించుదాం. నృసింహావతారంలో బయటకి రావడానికి సిద్ధంగా ఉన్నాడు సరే. ఆ అవతారం ఎందుకంటే హిరణ్యకశిపుడి కోరిక ప్రకారం అతడు చావాలి. మరి నానా జంగమ స్థావరాల్లో అదే రూపంలో ఎందుకు ఉండడం? ప్రహ్లాదుడు చెప్తున్నాడు కదా – ఇందుగలడందులేడని సందేహము వలదు అని. అక్కడ హరికింకరుడు అలా హామీలిచ్చేస్తూ ఉంటే వాటిని తీర్చడానికి సిద్ధంగా ఉన్నాడన్నమాట భగవంతుడు. ఇప్పుడు తండ్రి ఎక్కడ చూపించమంటాడో తెలియదు.ఏమో ఈ కత్తిలో చూపించు, ఈ రాయిలో చూపించు అంటే? అందుకే ఎక్కడపడితే అక్కడ్నుంచి రావడానికి కాసుకుని కూర్చున్నాడుట. ఏ విధంగా ఉన్నాడు? – తన కింకరుణ్ణి, ఇప్పటిదాకా పెట్టిన బాధలన్నీటికీ కసి తీర్చుకోవడానికి – ఉద్ధండ ప్రభావంతో ఉన్నాడు.

వచ్చే వ్యాసంలో నృసింహావతారావిర్భావం, దానిమీద పోతన రాసిన అత్యద్భుతమైన వచనం, అది అసలు తెలుగేనా అనిపించే అసలు సిసలు తెలుగూ చదువుదాం.

[ఈ వ్యాసంలో "తెలుగు పద్యం" బ్లాగు రాసే శ్రీ భైరవభట్ల కామేశ్వరరావు గారి ఆలోచనలు రాసాను. పూర్తిగా చదవాలనుకునేవారు ఇక్కడ చూడవచ్చు(చివరిలో). http://telugupadyam.blogspot.com/2012/09/blog-post.html ]

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS